## 161. ఎందుకని?

"స్వామీ! నేను ధ్యానం చేయలేక పోతున్నాను."

"ఎందుకని?"

"ఉద్వేగంగా ఉంటోంది."

"ఎందుకని?"

"ఆలస్యంగా లేవడంతో ఆఫీసుకి కూడా హడావిడిగా పరిగెత్తాల్సి వస్తోంది కాబట్టి."

"ఎందుకనలా?"

"రాత్రి భోజనం అయ్యాక రెండు మూడు పెగ్గుల విస్కీ తాగుతూ టి.వి చూడబట్టి ఆలస్యంగా నిద్ర పోతున్నాను."

"ఎందుకని?"

"..."

"సమస్య అర్ధమైందిగా? సమస్యని శిష్యుడి ముందు పెట్టడమే గురువు చేసే పని. పరిష్కారాన్ని శిష్యుడే అమలు చేయాల్సి ఉంటుంది."

## 162. అ, ఆలు

ఇద్దరు సన్యాసులు త్రివేణీ సంగమం దగ్గర స్నానం చేస్తున్నారు.

"ఎక్కడికి ప్రయాణం?" ఓ సన్యాసి ఇంకో సన్యాసిని ప్రశ్నించాడు.

"'అ' నించి 'ఆ' దాకా." జవాబు చెప్పాడు రెండో సన్యాసి.

"నా ప్రయాణం కూడా అంతే." చెప్పాడు మొదటి సన్యాసి.

వాళ్ళ మాటలు అర్ధంకాని ఓ బాటసారి అడిగాడు, వాళ్ళ మాటలకి అర్ధం చెప్పమని.

"'అ' అంటే అహంకారం. 'ఆ' అంటే ఆత్మ." ఏక కంఠంతో జవాబు చెప్పారు ఇద్దరూ.